క్లుప్తంగా

వేదగిరి లక్ష్మీనృసింహుడి దేవస్థాన ఈఓగా గోపీ



నెల్లూరు సిటీ: వేదగిరి లక్ష్మీనృసింహుడి దేవస్థాన ఈఓగా వేమూరి గోపీ బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. మెట్ల పూజ చేసి, మెట్ల మార్గం ద్వారా కాలినడకన కొండపైకి చేరుకున్నారు. స్వామి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆయనకు ఆశీర్వచనాలను వేదపండితులు అందజేశారు. దేవదాయ శాఖ పరిశీలకుడు సుధీర్, వేదపండితులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల శ్రమదానం



నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్న ఎన్నెస్సెస్ విద్యార్థినులు శ్రమదానాన్ని శుక్రవారం చేపట్టారు. చింతారెడ్డిపాళెంలోని యలమవారిదిన్నెలో వీధులకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. దోమల లార్వాల నివారణకు ఆయిల్‌బాల్స్ వేశారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఏఓ చంద్రశేఖర్, కౌన్సిలర్ భాస్కర్‌రావు మాట్లాడారు. రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించారు. అతిథులకు జ్ఞాపికలను అందజేశారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి, ఎన్నెస్సెస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారి ప్రసూనకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే శ్రీవారి దర్శనం



మాట్లాడుతున్న ఆనం

నెల్లూరు(దర్గామిట్ట): తిరుమల ఆగమ శాస్త్రాలు, టీటీడీ నిబంధనలను అమలు చేసి తీరుతామని, అన్యమతస్తులు ఎవరైనా డిక్లరేషన్ ఇచ్చే ఆలయంలోకి ప్రవేశించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తిరుమల పవిత్రతను కాపాడటం, ఆగమ శాస్త్రాలు, సనాతన హైందవ ధర్మాలను పాటించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా మాగుంట

నెల్లూరు సిటీ: గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

అక్కినేని పాటల పందిరి రేపు



నెల్లూరు(బృందావనం): ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంత్యుత్సవాల్లో భాగంగా నగరంలోని పురమందిరంలో అక్కినేని పాటల పందిరి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఘంటసాల ఆర్ట్స్, మ్యూజికల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు మునికృష్ణ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సరస్వతీనగర్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. ఆర్డీఓ మలోల, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత రమేష్, గాయకులు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి, జనార్దన్, కనకరాజు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ మూడు నుంచి నిర్వహించనున్నామని మందిర కమిటీ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిర ప్రాంగణంలో శుక్రవారం ఆవిష్కరించారు. ట్రస్టీలు పట్టాభిరామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఫణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తితో పొదుపు సంఘాల అభివృద్ధి



అర్బన్ మార్కెట్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన అతిథులు

నెల్లూరు(బారకాసు): పొదుపు సంఘాల మహిళలు తమ స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలను కల్పిస్తున్నామని మెప్మా పీడీ రవీంద్ర పేర్కొన్నారు. తడికలబజార్ సెంటర్ సమీపంలోని బీవీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద అర్బన్ మార్కెట్‌ను మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలు తమ స్వశక్తితో తయారు చేసిన వస్తువులను అర్బన్ మార్కెట్ ద్వారా తక్కువ ధరకే విక్రయించనున్నారని వివరించారు. తక్కువ వడ్డీకే రుణాలను అందజేసేందుకు బ్యాంకులు ముందుకొస్తున్నాయని తెలిపారు. కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ఇండియన్ బ్యాంక్ నవాబుపేట బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్, మెప్మా సిబ్బంది కాంతయ్య, పెంచలయ్య, జరీనా, అబీద్ అలీ బేగ్, గీత, కామాక్షయ్య, లక్ష్మీప్రసన్న, చందన, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

'గుండె శస్త్రచికిత్సల్లో రికార్డు'



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 50,060 గుండె శస్త్ర చికిత్సలు చేసి రికార్డు నెలకొల్పామని ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు పేర్కొన్నారు. ఆస్పత్రిని ఏర్పాటు చేసి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇందులో 70 శాతం శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశామని వివరించారు. కార్డియాలజీ విభాగంలో ఇప్పటి వరకు 4.42 లక్షల ఓపీలు, 54,900 మందికి ఐపీలో వైద్యసేవలను అందించామని చెప్పారు. హృద్రోగుల రక్తనాళాల్లోకి చిన్న కెమెరాను పంపి చికిత్సను సులభతరం చేసే అత్యాధునిక ఓసీటీ యంత్రాన్ని నెల్లూరులో తొలిసారిగా తమ ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. వైద్యులను ఆస్పత్రి ఈడీ గిరినాయుడు అభినందించారు. డాక్టర్లు సాహెబ్‌పీరా, లోకేష్, ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌కుమార్, నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



నెల్లూరు (టౌన్): విజయవాడలోని వరద బాధితులకు పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు విరాళాన్ని ప్రకటించాయి. నేతాజీ పైలట్ స్కూల్ రూ.4,00,500, సిల్వర్ ఓక్స్ స్కూల్ రూ.1,50,600, ఆర్ఎస్ స్కూల్ రూ.41,700, సాయిచైతన్య స్కూల్ రూ.20 వేల సాయాన్ని అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి కృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటాద్రికి శుక్రవారం అందజేశారు. అపస్మా నేతలు వెంకటేశ్వరరెడ్డి, రమేష్, అభిషేక్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో స్వచ్ఛత హీ సేవ



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని వేదాయపాళెం రైల్వేస్టేషన్లో సచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ మునిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అనంతరం స్టేషన్ పరిసరాలను శుభ్రపర్చి మొక్కలు నాటారు.

రెడ్ల మేధోమథన సదస్సు రేపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బృందావనం): రెడ్ల మేధోమథన సదస్సును నగరంలోని భక్తవత్సలనగర్‌లో ఆదివారం నిర్వహించనున్నామని రెడ్ల ఐక్యవేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పేర్కొన్నారు. శాంతినగర్‌లోని నిర్మల సౌధలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువుర్ని సత్కరించారు. వేదిక నిర్వాహకులు డాక్టర్ బీవీ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కృపాకర్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న ఇద్దరికి సీఎం సహాయనిధి చెక్కులను రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం అందజేశారు. నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని శెట్టిగుంటరోడ్డు సెంటర్‌లోని వీవర్స్ కాలనీలో ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతలు నరసింహ, నరేంద్ర పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకరుల సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. రక్తదానం చేసేందుకు తరలిరావాలని కోరారు. నేతలు చరణ్, జగదీష్, శేఖర్, సురేష్, శ్రీహరి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా..



నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏనీ టైమ్ బ్యాగ్ (ఏటీబీ) మెషీన్ అలంకారప్రాయంగా మారింది. ప్లాస్టిక్ భూతాన్ని నియంత్రించాలనే లక్ష్యంతో రూ.పదికి ఒక క్లాత్ బ్యాగ్ వచ్చేలా గత ప్రభుత్వ హయాంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఈ మెషీన్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఇది నిరుపయోగంగా మారింది.

– నెల్లూరు(సెంట్రల్)

కాకాణికి సత్కారం



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. డైకస్‌రోడ్డులోని ఆయన నివాసానికి భారీగా తరలివచ్చి అభినందనలను తెలియజేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను సీఈఓ ఖాదర్‌బాషా, డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కార్పొరేషన్ సెక్రటరీగా శ్రీలక్ష్మి



నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్ సెక్రటరీగా శ్రీలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బాధ్యతలను శుక్రవారం ఆమె స్వీకరించారు.

స్పెషాలిటీ సేవలను తక్కువ ఖర్చుకే అందించాలి



సోమిరెడ్డిని సత్కరిస్తున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను తక్కువ ఖర్చుకే అందించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. ఎనెల్ స్పెషాలిటీ ఆస్పత్రి రెండో వార్షికోత్సవాన్ని మాగుంట లేఅవుట్లోని ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని సత్కరించారు. హాస్పిటల్ చైర్మన్ కుంకాల నాగేంద్రప్రసాద్, నేతలు బొమ్మి సురేంద్ర, చక్రవర్ధన్‌రెడ్డి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రణీత్, ఆడిటర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): చట్టాలపై అవగాహన అవసరమని సంతపేట ఇన్‌స్పెక్టర్ మద్ది శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, మహిళల రక్షణ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితరాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కాంక్షించారు. ఆపద సమయాల్లో 112కు సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని చెప్పారు.

ఎక్సైజ్ డీసీకి శుభాకాంక్షలు



నెల్లూరు(క్రైమ్): ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావును బీవీనగర్‌లోని ఆయన కార్యాలయంలో ఆ శాఖ హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

ఆనం విజయకుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు



నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా నియమితులైన ఆనం విజయకుమార్‌రెడ్డికి మాజీ కార్పొరేటర్ రజిని శుభాకాంక్షలను తెలియజేశారు. ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

సుధాకర్ ప్రసాద్ చిరస్మరణీయుడు



సుధాకర్ ప్రసాద్ సతీమణి కామాక్షి, ఏపీ జేఏసీ అమరావతి కో చైర్మన్ శ్రీనివాసరావు, కోశాధికారి కనపర్తి సంగీతరావు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(దర్గామిట్ట): ఉద్యోగుల సంక్షేమం, వారి సమస్యల సాధన కోసం రాజీలేని పోరాటం చేసిన తోట సుధాకర్ ప్రసాద్ చిరస్థాయిగా నిలిచిపోయారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సుధాకర్ ప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకొని భక్తవత్సలనగర్‌లోని రెవెన్యూ భవన్ వద్ద ఆయన కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వాత్సల్య వృద్ధాశ్రమంలో పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు. రెవెన్యూ భవన్ వద్ద వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. జేసీ కార్తీక్, డీఆర్వో లవన్న, పాలిశెట్టి దామోదర్‌రావు, రామిశెట్టి వెంకటరాజేష్, అల్లంపాటి పెంచలరెడ్డి,

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): రిజిస్ట్రేషన్, ఇతర నిబంధనలను పాటించే విషయంలో స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలకు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశాల మేరకు చివరి అవకాశాన్ని కల్పిస్తున్నామని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ స్పష్టం చేశారు. నగరంలోని ఆశ్రిత ఆస్పత్రి, మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్, నిశ్చల శ్రీరామకృష్ణ కిడ్నీ ఆస్పత్రి, సాయిశ్రీ స్పెషాలిటీ ఆస్పత్రి, సరయూ ఆస్పత్రిలోని స్కానింగ్ కేంద్రాలను వైద్యశాఖ డెమో అధికారి కనకరత్నంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పీసీ, పీఎన్డీటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, స్కానింగ్ ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. స్కానింగ్ చేసిన గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచించారు.

కశ్మీర్‌లో శిక్షణ కార్యక్రమానికి మేయర్



నెల్లూరు(బారకాసు): దేశాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దడంలో కార్పొరేషన్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపై కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆమె మాట్లాడారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



నెల్లూరు (టౌన్): సంస్కృతి, పర్యావరణాన్ని కాపాడుకుందామని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పాత ఎస్పీ కార్యాలయం, స్వర్ణాల చెరువు, ఇరుకళల పరమేశ్వరి ఆలయాలను విద్యార్థులతో కలిసి శుక్రవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్కృతి, వారసత్వం, పురాతన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ అధికారులు కరుణకుమారి, ప్రసన్న, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కలిగిరి పీహెచ్‌సీ పరిధిలోని రావులకొల్లు ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న పందిటి విజయమ్మను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఆమెను విధుల్లోకి తీసుకోకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ స్పష్టం చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. విజయమ్మను తొలగించి తనకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు సర్పంచ్ వెంగపనాయుడు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆమెకు న్యాయం చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నేతలు లక్ష్మి, మేరీ, అరుణ, గౌసియా, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



నెల్లూరు (టౌన్): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాయపాళెంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. మూడు సీలింగ్ ఫ్యాన్లను సీజీఎస్టీ సూపరింటెండెంట్ మురళీకృష్ణ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, శ్రీనివాసులు, జయేంద్ర, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు.

టీ - 20 క్రికెట్ టోర్నీ నేడు

నెల్లూరు(బృందావనం): సత్యసాయి యూనిటీ కప్ టీ - 20 క్రికెట్ టోర్నీని శనివారం నిర్వహించనున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుజబుజనెల్లూరులోని క్రికెట్ స్టేడియంలో పోటీలను ప్రారంభించనున్నామని చెప్పారు. విజేతగా నిలిచిన జట్టు విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుందని పేర్కొన్నారు. వివరాలకు 98499 84981, 94939 98193 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

స్వీపర్, వాచ్‌మెన్లను కొనసాగించాలి

నెల్లూరు (టౌన్): నగరపాలక సంస్థ పాఠశాలల్లో స్వీపర్ కమ్ వాచ్‌మెన్లను కొనసాగించాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సుబ్బు, ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆప్కాస్ ద్వారా విధులు నిర్వర్తిస్తున్న వీరిని తొలగించాలనే నిర్ణయాన్ని ఖండించారు.